

◆ కృష్ణా తూర్పు, పశ్చిమకు నీటి విడుదల ◆ తాగునీటి అవసరాలకు మాత్రమే
◆ ప్రారంభించనున్న మంత్రి నిమ్మల ◆ ప్రకాశం బ్యారేజీ వద్ద 2.9 టీఎంసీల నీటి నిల్వలు

నీటి విడుదల నేడే



పవిత్రసంగమం వద్ద పరవళ్లు తొక్కుతున్న పట్టిసీమ నీరు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ప్రకాశం బ్యారేజీకి వెనుక ఉన్న కృష్ణమ్మ కాలువల ద్వారా పరుగులు తీయబోతోంది. కృష్ణా తూర్పు, పశ్చిమ ఛానళ్లకు బుధవారం ఉదయం పది గంటలకు మంత్రి నిమ్మల రామానాయుడు అధికారికంగా నీటిని విడుదల చేయబోతున్నారు. పట్టిసీమ నుంచి ఎత్తిపోస్తున్న గోదావరి నీరు ప్రకాశం బ్యారేజీని తాకిన విషయం తెలిసిందే. దీంతో తొలుత తాగునీటి అవసరాలను తీర్చడానికి నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రకాశం బ్యారేజీలో గోదావరి నీరు రాకతో మొత్తం 2.9 టీఎంసీ నీరు నిల్వ ఉంది. కృష్ణా తూర్పు చానల్‌కు 1000, పశ్చిమ చానల్‌కు 1000 క్యూసెక్కుల నీటిని తొలుత విడుదల చేస్తారు. తర్వాత అంచెలంచెలుగా ఈ నీటి విడుదలను పెంచుతారు. పది రోజులపాటు పూర్తిగా తాగునీటి అవసరాలను తీర్చడానికే నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. కృష్ణా జిల్లాలో మచిలీపట్నంలో తాగునీటి కటకటలు కనిపిస్తున్నాయి. దీంతో తూర్పు, పశ్చిమ చానళ్ల కింద ఉన్న చెరువులను విడుదల చేయబోయే నీటితో నింపాలని భావిస్తున్నారు. తూర్పు చానల్‌లో 547, పశ్చిమ చానల్ పరిధిలో 127 చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు నిండే వరకు నీటిని విడుదల చేస్తారు. ఇందుకోసం పది రోజుల ప్రణాళికను రూపొందించారు. ఈ చెరువులన్నీ నిండిన తర్వాత సాగునీటి అవసరాలను తీర్చబోతున్నారు.



పేట్రేగిపోతున్న మట్టి మాఫియా

వేలాది టన్నుల మట్టి అక్రమ నిల్వలు

- వైసీపీ నేత అక్రమ దందా
- భారీ స్థాయిలో ముడుపులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

6లో..

ఆక్రమణలు ఆపై నిర్మాణాలు!



ఐదు రోడ్ల సెంటరు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం

పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు

- » బందరులోని ఐదురోడ్ల సెంటరులో మూడు అంతస్తులకు అనుమతులు
- » నాలుగో అంతస్తు నిర్మాణం
- » మునిసిపల్ స్థలాల ఆక్రమణ
- » అయినా చోద్యం చూస్తున్న అధికారులు

“ మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు మారడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా భవనాల నిర్మిస్తున్నా అధికారులు ఆ వైపునకు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటివరకు వైసీపీ నాయకులతో అంటకాగిన అధికారులు తమ పనితీరును మార్చుకోకుండా పాత పద్ధతిలోనే వ్యవహరిస్తున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిబంధనలను తుంగలో తొక్కి, భవనాల నిర్మాణం చేస్తున్నా పట్టించుకోకుండా ఉండటం విమర్శలకు తావిస్తోంది. తమను ప్రసన్నం చేసుకుంటే అక్రమ కట్టడాలను సక్రమం చేస్తున్నారనే ఆరోపణలను మూటగట్టుకుంటున్నారు. కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారుల తీరు కారణంగా నగరంలో అక్రమ కట్టడాల నిర్మాణం మూడు అంతస్తులకు అనుమతులు, నాలుగైదు అంతస్తుల్లో నిర్మాణాలు అన్న చందంగా సాగిపోతోంది. - ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం

● ఈ అక్రమాల సంగతేంటి?

● మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి అత్యంత సమీపంలో ఉన్న కూడలిలో ఒక దుకాణ సముదాయాన్ని ఇటీవల నిర్మించారు. పార్కింగ్ ప్రాంతం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారు. ఈ దుకాణ సముదాయం అడ్డగోలుగా నిర్మాణం చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదు.

● మచిలీపట్నంలోని ఐదురోడ్ల సెంటరుకు సమీపంలో వైసీపీకి చెందిన కార్పొరేటర్ ఒకరు, మరో వ్యాపారితో కలిసి నూతన భవన సముదాయం నిర్మిస్తున్నారు. జీ+3 పద్ధతిలో అనుమతులు తీసుకుని నాలుగో అంతస్తు నిర్మిస్తున్నారు. ఇటీవలే నాలుగో అంతస్తుకు శ్లాబు కూడా వేశారు. ఒక్కోఫ్లాట్‌ను కోటి రూపాయలకు విక్రయిస్తున్నారు. అయినా ఈ భవన నిర్మాణంవైపు టౌన్‌ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

● మచిలీపట్నం కార్పొరేషన్ పరిధిలోని కాలేఖాన్‌పేట సెంటరులో కార్పొరేషన్‌కు సంబంధించిన పార్కు స్థలం ఉంది. దీన్ని గతంలోనే ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడు. దీంతో అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఈ స్థలం పురపాలక సంఘానికి చెందినదేనని ఓఎస్ 605 నెంబరుతో గతంలో కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ స్థలం పక్కనే రోటరీక్లబ్ బస్‌షెల్టర్ కూడా ఉంది. ఈ స్థలంలో రేకులషెడ్డు వేసి నెలకు రూ.6వేల చొప్పున అద్దె వసూలు చేస్తున్నారు.

● జిల్లా పరిషత్ సెంటరు నుంచి పెడన వెళ్లే రహదారిలో బందెలదొడ్డి స్థలాన్ని అక్రమించి పక్కా భవనం నిర్మించారు. అప్పటి వైసీపీ పాలకులు చెప్పారనే కారణంతో ఈ ఆక్రమణ వైపునకు టౌన్‌ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడలేదు. ఆక్రమించిన స్థలంలో సగభాగాన్ని వేరే వ్యక్తులకు విక్రయించి, వచ్చిన సొమ్ముతో పక్కనే పక్కా భవనం నిర్మించారు. స్థానికులు మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన బందెలదొడ్డి స్థలంలో పక్కా భవనం నిర్మాణం చేస్తున్నారని పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు.

మున్సిపల్ స్థలంలో భవన నిర్మాణం

మచిలీపట్నం నోబుల్‌కాలనీలో చర్చి పక్కనే మునిసిపల్ పార్కు స్థలాన్ని వైసీపీ కార్పొరేటర్ బంధువు ఆక్రమించి రెండస్తుల భవనం నిర్మాణం చేశారు. ఈ భవన నిర్మాణంపై టీడీపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ భవనాన్ని కూల్చి వేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్లుగా ఈ అదేశాలను అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు

● ఆదాయ మార్గాలను వదిలేశారు

నగరంలోని బైపాస్‌రోడ్డు వెంబడి వేసవి కాలంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేవారు. మునిసిపల్ కార్పొరేషన్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నారు. వైసీపీ నాయకులు అనుమతులు ఇవ్వవద్దని చెప్పారంటూ టౌన్‌ప్లానింగ్ అధికారులు అను మతులు మంజూరు చేయలేదు. మునిసిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం సమకూరుతుందని, అనుమతులు ఇవ్వాలని కమిషనర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించినా అను మతులు ఇవ్వకుండా తొక్కిపెట్టడం గమనార్హం. మచిలీపట్నం టౌన్‌ప్లానింగ్ అధికారులే, మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) లోనూ ఇన్‌చార్జి ప్లానింగ్ అధికారు లుగా పనిచేస్తుండటం గమనించదగ్గ అంశం.

ఫుడ్‌కోర్టు విషయంలోనూ ఇదే తంతు

మచిలీపట్నం మార్కెట్‌యార్డుకు వెళ్లే రహదారి వెంబడి ఇరువైపులా ఉన్న ఖాళీ జాగాను విడగొట్టి వైసీపీ నాయకులు ఫుడ్‌కోర్టు పేరుతో షాపులు ఏర్పాటు చేయించారు. దీనిపై అప్పటి ప్రతిపక్ష నాయకులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. పైగా అక్కడ మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా వీధి దీపాల పేరుతో ఫ్లడ్‌లైట్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ రహదారికి ఇరువైపులా ఉన్న గృహ యజమానులు ఫుడ్‌కోర్టును ఇక్కడి నుంచి తొలగించాలని హైకోర్టును ఆశ్రయించారు. డ్రెయిన్ పక్కనే అపరిశుభ్ర వాతావరణంలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టును తొలగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను అమలు చేయకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు నెలల తరబడి జాప్యం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ ఫుడ్‌కోర్టును రెండురోజుల క్రితం తొలగించారు.

మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని నిర్లక్ష్యం పట్టణవాసుల పాలిట శాపంగా మారింది. గత ప్రభుత్వంలో తాగునీటి సమస్య నివారణ చర్యలు చేపట్టిన పాపాన పోలేదు. సమస్యను పరిశీలించిన సందర్భం లేదు. సమీక్షలు లేవు. పంపుల చెరువుల కట్ట తెగినా మరమ్మతులు లేవు. తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి అన్నట్టు శివారు ప్రాంతాలకు నాలుగు ట్యాంకర్లు పెట్టి వదిలేశారు. అవి ఏ మూలకూ సరిపోక జనం సతమతమవుతున్నారు. కూటమి అధికారంలోకి రాగానే పైపులైన్ల అనుసంధానంపై దృష్టి సారించింది. ఎద్దడి నివారణ చర్యలకు ఉపక్రమించింది. అమృత్ పథకం 2.0 ద్వారా అండర్ గ్రౌండ్ సంప్ నిర్మాణానికి పూనుకుంది.



వాటర్ ట్యాంకర్ వద్ద నీటి కోసం ప్రజల పాట్లు (ఫైల్)

నాని నిర్లక్ష్యంతోనే..

గుడివాడలో తాగునీటి కష్టాలు తీవ్రం

చిన్న చెరువు కట్ట తెగి మూడేళ్లవుతున్నా పట్టించుకోలేదు

- ☛ తాగునీటి అవసరాలపై ఏనాడు చర్చల్లేవు
- ☛ నేటికీ శివారు ప్రాంతాలకు ట్యాంకర్‌లే దిక్కు
- ☛ నీటి సమస్యపై కేంద్రీకరించిన కూటమి ప్రభుత్వం
- ☛ అండర్ గ్రౌండ్ సంప్‌వెల్ నిర్మాణానికి చర్యలు

గుడివాడ : పట్టణవాసుల నీటి అవసరాలను తీర్చే చిన్న చెరువుకు మూడేళ్ల క్రితం కట్ట తెగింది. లక్షలాది లీటర్ల మంచినీరు కాలువలు, డ్రెయిన్ల పాలైంది. మూడేళ్లలో చెరువు కట్టకు మరమ్మతులు చేయలేదు. ఆవైపు కన్నెత్తి కూడా చూడలేదు. పెద్ద చెరువు కట్ట పటిష్టతపై అనుమానాలు ఉండటంతో అధికారులు నీటి నిల్వ తగ్గించారు. వాస్తవ సామర్థ్యం 14 ఎత్తు. 11 అడుగుల మేర నీరు నింపారు. అయితే ప్రస్తుతం 5 అడుగుల ఎత్తు నీరు మాత్రమే మిగిలింది. చిన్న చెరువు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 634 మిలియన్ లీటర్లు. కేవలం 200 మిలియన్ లీటర్లు మాత్రమే నింపారు.

● అవసరాలకు తగ్గ కార్యాచరణ శూన్యం

పట్టణ దాహార్తిని తీర్చాలంటే రోజుకు 1.25 కోట్ల లీటర్ల నీరు అవసరం. ఎక్కడా తాగునీటిని సక్రమంగా అందించిన దాఖలాలు లేవు. దీంతో శివారు ప్రాంతాలకు నేటికీ మున్సిపాల్టీ, స్వచ్ఛంద సంస్థలు అందించే నీరే దిక్కైంది. టిడ్కో కాలనీ విలీనంతో పట్టణవాసుల నీటి కష్టాలు మరింత పెరిగాయి. 20 ఏళ్ల శాసనసభ్యునిగా గుడివాడను ఏకచత్రాధిపత్యంగా ఏలిన కొడాలి నాని పట్టణ ప్రజలను నట్టేటా ముంచారు. తాగునీటి అవసరాలను తీర్చే పంపుల చెరువులను గాలికి వదిలేశాడు. ఒక చెరువుకు కట్ట తెగి, మరో చెరువుకు కట్టలు బలహీనమవ్వడంతో పూర్తిస్థాయిలో నీటిని నింపే పరిస్థితి లేకుండా పోయింది.

● అమృత్ పథకాన్ని వినియోగించుకోలేక..

గత టీడీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ పథకంలో భాగంగా పట్టణంలో రెండు ఎలివేటెడ్ రిజర్వాయర్‌లను నిర్మించారు. కొత్త పైపులైను కూడా వేశారు. కానీ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఏనాడూ దీనిపై దృష్టి పెట్టలేదు. ఎలివేటెడ్ రిజర్వాయర్‌లతో కొత్త పైపులైను అనుసంధానం చేయడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో తాగునీటి సమస్య మరింత జఠిలమైంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా శివారు ప్రాంతాల ప్రజలు నేటికీ ట్యాంకర్‌ల నీటిపైనే ఆధారపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా హెడ్ వాటర్ వర్క్స్ వద్ద మరో అండర్ గ్రౌండ్ సంప్‌వెల్‌ను నిర్మిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన పైపులైన్లు, నిర్మించిన రిజర్వాయర్‌లను అనుసంధానం చేసే పని మొదలుపెట్టింది.

● ఆర్వో ప్లాంట్‌ల నీరే దిక్కు

పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో ఎరుపు రంగులో బురద నీరు కూడా సరఫరా అవుతోంది. దీంతో మున్సిపాల్టీ పైపుల ద్వారా వస్తున్న నీటిని తాగాలంటే బెంబేలెత్తి పోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్వో ప్లాంట్‌ల నుంచి నీటిని కొని తెచ్చుకోవలసి వస్తోంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని వాటర్ ట్యాంకు వద్ద ఉన్న పబ్లిక్ ట్యాపు ప్రజల అవసరాలను తీరుస్తోంది. నీటిని కొనుగోలు చేయలేని వారు ఈ నీటిని తాగునీటి అవసరాలకు తీసుకెళుతున్నారు. సమస్యపై మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పంపుల చెరువుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో రెండు రోజులకొకసారి నీటి సరఫరా చేస్తామని, మొన్నటి వరకు టిడ్కో కాలనీకి మాత్రమే రోజు విడిచి రోజు నీటిని అందించామని, ఇప్పుడు దీన్ని పట్టణమంతా అమలు చేయాల్సి వస్తోందని అన్నారు.



బ్రహ్మయ్యలింగం చెరువుకు.. పర్యాటక సొబగులు

బోటింగ్, కాటేజీలు, రెస్టారెంట్ ఏర్పాటుకు ఏపీటీడీసీ ఆసక్తి

- ☛ క్షేత్రస్థాయిలో పరిశీలనకు ఉన్నతాధికారుల నిర్ణయం
- ☛ ఆధ్యాత్మికత, పర్యాటక కలబోతగా.. బ్రహ్మలింగం చెరువు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) గన్నవరం ప్రజల కల నెరవేరబోతోంది. ప్రసిద్ధిగాంచిన బ్రహ్మలింగం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) దృష్టి సారించింది. త్వరలో ఈ ప్రాంతాన్ని పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారులు సందర్శించనున్నారు. గన్నవరం మండలం, చిక్కవరం సమీపంలో సువిశాలమైన 1200 ఎకరాల బ్రహ్మయ్యలింగం చెరువులో బోటింగ్ నిర్వహణ, కాటేజీలు, రెస్టారెంట్ ఏర్పాటు వంటి అంశాలను అధికారులు పరిశీలించనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఏపీటీడీసీ అధికారులు బ్రహ్మయ్యలింగం చెరువులో బోటింగ్ కార్యకలాపాలకు ప్రయత్నాలు చేశారు.

గత టీడీపీ ప్రభుత్వంలో శ్రీకారం..

బ్రహ్మలింగం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చెయ్యాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. పోలవరం కుడి కాలువ నీటిని బ్రహ్మయ్యలింగం చెరువులో నింపేందుకు కొత్తగూడెం వద్ద ఎత్తిపోతల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈలోగా ఎన్నికలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వం పర్యాటకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వంలో ఏపీటీడీసీ ఉన్నతాధికారులు బ్రహ్మయ్యలింగం చెరువు అభివృద్ధికి దృష్టి సారించారు.

పర్యాటక ఆవశ్యకత..

ఆలయానికి చేరుకోవటానికి ఘాట్ రోడ్డుపై సిమెంట్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ఆలయ అభివృద్ధితో పాటు ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధిచెందాల్సిన అవసరం ఉంది. చెరువులో బోటింగ్ కార్యకాలాపాలు ప్రారంభమైతే పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుంది. ట్రెక్కింగ్, క్యాంపింగ్‌కు కూడా ఈ ప్రాంతం అనువుగా ఉంటుంది. కాటేజీ, రెస్టారెంట్ వంటివి కూడా దిగువన నిర్మిస్తే మరింత ఆదరణ కలిగే అవకాశం ఉంది.

● కూటమి ప్రభుత్వంలో లారీ ఇసుక రూ.12వేలు

ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతంలోని 8 ఇసుక యార్డుల్లో ఇసుక లభ్యమవుతుంది. వీటిలో కీలకమైనది కీసర యార్డు. ఇక్కడ టన్ను రూ.290 నామినల్ ధరకే ఇసుకను అందిస్తున్నారు. సగటున ఒక వినియోగదారునికి 20 మెట్రిక్ టన్నుల ఇసుకను అందిస్తున్నారు. ఈ లెక్కన 20 టన్నులకు కలిపి రూ.5800 ఖర్చు మాత్రమే అవుతోంది. ఈ 20 టన్నుల ఇసుకను తీసుకు వెళ్లే సామర్థ్యం కలిగిన పది చక్రాల లారీకి సంబంధించి ట్రాన్స్‌పోర్టు ధర మరో రూ.5 వేల నుంచి రూ.6 వేలు అవుతుంది. ఈ లెక్కన గరిష్టంగా తీసుకున్నా 20 టన్నుల ఇసుక రూ.12,000కే లభిస్తోంది.

● వైసీపీ పాలనలో లారీ ఇసుక రూ.24వేలు

“ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో టన్నుకు రూ.700 - రూ.800 వరకు స్టాక్ యార్డుల్లో వసూలు చేశారు. దీనికితోడు అధికారులకు, స్టాక్ యార్డుల్లో సిబ్బందికి లంచాలు ఇవ్వాల్సి వచ్చేది. ఇలా అన్ని ఖర్చులు కలిపితే రూ.1000 వరకు అయ్యేది. మొత్తం 20 టన్నుల ఇసుక రూ.20 వేలు అయ్యేది. రవాణా ఖర్చు రూ.6 వేలు కలిపితే రూ.24 వేల వరకు గరిష్టంగా ఇసుక ధర ఉండేది.



కీసర స్టాక్ యార్డులో ఇసుక లోడింగ్

సగం ధరకే..!

“ సామాన్యుడి కల నెరవేరుతోంది. ఇంటి నిర్మాణం కోసం గత ఐదేళ్లు పడ్డ కష్టానికి ఈ ప్రభుత్వంలో ఉపశమనం లభిస్తోంది. అతి తక్కువ ధరలో ఇసుక అందుబాటులోకి వచ్చింది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 8 స్టాక్ యార్డుల్లో ప్రభుత్వం ఈ సౌకర్యం కల్పించింది. పది చక్రాల లారీలో 20 మెట్రిక్ టన్నుల ఇసుక తీసుకు వెళ్లే వినియోగదారునికి రూ.12వేలకే ఇసుకు ఇంటికి చేరుతోంది. గత ప్రభుత్వంలో ఇదే లారీ ఇసుక ఇంటికి చేరేసరికి రూ.24వేలు అయ్యేది. ఉచిత ఇసుక మొదలైన తొలి రెండ్రోజుల్లోనే యార్డుల వద్ద వాహనాలు భారీగా క్యూ కట్టాయి.

వైసీపీ ప్రభుత్వంలో లారీ ఇసుక రూ.24 వేలు | కూటమి ప్రభుత్వంలో రూ.12 వేలకే ఇంటికి..

- ● ఎన్టీఆర్ జిల్లాలో నియంత్రణలోకి వచ్చిన రవాణా చార్జీలు
- ● కీసర నుంచి విజయవాడకు పది చక్రాల లారీకి రూ.6 వేలు
- ● ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు ఇంకా తక్కువ ధరకే..
- ● భవానీపురం, గొల్లపూడిలలో స్టాక్ యార్డులు ఏర్పాటు చేస్తే విజయవాడ వాసులకు మరింత తక్కువ ధరకు..
- ● ఇసుక స్టాక్ యార్డుల్లోని నిల్వలు వారం రోజుల వరకే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గత ప్రభుత్వంలో పోల్చుకుంటే కూటమి ప్రభుత్వంలో ఉచిత ఇసుక పథకం వల్ల వినియోగదారులు సగం ధరకే ఇసుకను పొందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతంలోని వారైతే మరో 2 నుంచి 3 వేలు మినహాయింపు కూడా పొందుతున్నారు. బ్లాక్ మార్కెట్ తగ్గటం, ఎన్‌ఫోర్స్‌మెంట్ పెరగటం, జరిమానాల భయంతో రవాణా వాహనదారులు కూడా న్యాయబద్ధంగానే తీసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతంలో దగ్గరగా ఉండటం వల్ల ట్రాన్స్‌పోర్ట్ ధరల్లో ప్రయోజనాలు పొందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచి తూర్పు ప్రాంతం వచ్చే వాహనాలకు సగానికి సగం ప్రయోజనం దక్కుతుండటం విశేషం.

విజయవాడ సమీపంలో స్టాక్ యార్డులు ఏర్పాటు చేయాలి

విజయవాడ గ్రేటర్ విలీన జాబితా గ్రామాల్లో నిర్మాణరంగం ఎక్కువగా ఉంది. దీంతో ఇసుకకు డిమాండ్ ఉంది. విజయవాడ పరిసర ప్రాంతాలైన భవానీపురం ప్రాంతంలో ఒక స్టాక్ యార్డును ఏర్పాటు చేయటం వల్ల రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతతాయి. దీనివల్ల ఈ ప్రాంత ప్రజలు మరింత తక్కువ ధరకే ఇసుక దక్కుతుంది. విజయవాడ ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణం భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల్లో మూడు నుంచి నాలుగు ఇసుక స్టాక్‌యార్డులను కేటాయించాల్సిన అవసరం ఉంది.

స్టాక్ మరో వారానికే..

ప్రస్తుతం స్టాక్‌యార్డుల్లో ఉన్న ఇసుక నిల్వలు మరో వారం రోజుల వరకే అందుబాటులో ఉంటాయని తెలుస్తోంది. మంగళవారం జిల్లాలోని 8 స్టాక్ యార్డుల్లో వాహనాలు పోటెత్తాయి. క్షణం కూడా ఖాళీ లేకుండా వాహనాల రాకపోకలు సాగాయి. జిల్లాలో అత్యధికంగా 2 లక్షల టన్నుల వరకు కీసర స్టాక్‌యార్డులోనే నిల్వలు ఉన్నాయి. మిగిలినచోట్ల చాలా తక్కువగా ఉంది. మరో మూడు రోజుల్లో వీటిలో ఇసుక అయిపోయే అవకాశం ఉంది. కీసరలో ఉన్న నిల్వలు మరో వారం రోజులకు మాత్రమే సరిపోతాయి. జిల్లా యంత్రాంగం తక్షణం ఇసుక ర్యాంపుల నుంచి ఇసుకను తోడే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది.

● కీసర వద్ద టన్ను రూ.290 మాత్రమే

కంచికచర్ల : వైసీపీ పాలనలో కీసర స్టాక్ యార్డు టన్ను రూ.675 నుంచి రూ.800 వరకు తీసుకున్నారు. ట్రాక్టర్ ట్రక్కుకు 4.5 టన్నులు పడుతుంది. దీనికి రవాణా ఖర్చు కలుపుకుంటే రూ.5వేలకుపైగా ధర అవుతోంది. ఇప్పుడు యార్డుకు అయిన రవాణా ఖర్చు, లోడింగ్, సీనరేజ్, ఇతరత్రా పన్నులు కలిపి టన్నుకు కేవలం రూ.290 తీసుకుంటున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.1305 అవుతోంది. ప్రస్తుతం కంచికచర్లలో ట్రాక్టరు ఇసుక రూ.2వేల నుంచి రూ.2500 (యార్డు నుంచి రవాణా కలుపుకుని) పడుతోంది. యార్డు వద్ద ఇసుక కోసం క్యూలో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నందున రవాణాకు కిరాయి ఎక్కువ తీసుకుంటున్నారు. ముున్ముందు ఈ ధర ఇంకా తగ్గుతుంది.

వైసీపీ పాలనలో ఇంటి నిర్మాణం ఆగిపోయింది



వైసీపీ పాలనలో ఇసుక కోసం పడిన బాధలు వర్ణనాతీతం. ఒక దశలో పది వేలు ఇస్తామన్నా ట్రక్కు ఇసుక కూడా దొరకలేదు. గత్యంతరం లేక ఇంటి పనులు ఆపేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వడం సంతోషంగా ఉంది.

- జూలూరు విశ్వనాథం, కంచికచర్ల

పటిష్ట భద్రత!



» దుర్గగుడి సెక్యూరిటీ పటిష్టతపై సమీక్ష

వన్‌టౌన్, జూలై 9 : దుర్గగుడిలో సెక్యూరిటీ వ్యవస్థ పటిష్టతపై ఆలయ అధికారులు, పోలీసు అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. 2020లో ఆలయ సెక్యూరిటీ వ్యవస్థ, ఇతర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలకు ఇదే తరహాలో సమీక్షించి నివేదిక తయారు చేశారు. నాటి సూచనలతో పాటు తాజా పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పలు సూచనల కోసం ఆలయంలోని డోనర్‌సెల్‌లో కీలక సమావేశాన్ని నిర్వహించారు. సెక్యూరిటీ విభాగం, సీసీ కెమెరాల నిర్వహణ, భక్తులు ప్రవేశించే.. నిష్క్రమించే మార్గాలు, క్యూలు, అత్యవసర మార్గాలు, భక్తుల రద్దీ సమయాలలో అనుసరించాల్సిన విధి విధానాలపై చర్చించారు. బుధవారం కూడా సమావేశాన్ని కొనసాగించి నివేదికను రూపొందించనున్నారు. ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పరిమిత స్థలంలోనే ఎటువంటి ఏర్పాట్లు ఉండాలన్న దానిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనున్నారు. డీసీపీలు ఏబీటీఎస్ ఉదయరాణి, వెస్ట్‌జోన్ డీసీపీ హరికృష్ణ, డీసీపీ మురళీకృష్ణారెడ్డి, ఇంటెలిజెన్స్ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఈవో రామారావు డిప్యూటీ ఈవో లీలాకుమార్, ఈఈ కోటేశ్వరరావు, ట్రాఫిక్, అగ్నిమాపక, ఆర్ అండ్ బీ, మునిసిల్ కార్పొరేషన్, విద్యుత్ తదితరడిపార్ట్‌మెంట్ల అధికారులు, వన్‌టౌన్ సీఐ, ఆలయ ఎస్‌పీఎఫ్, ఎగిల్ సంస్థ అధికారులు పాల్గొన్నారు.



దుర్గగుడి భద్రత ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారులు



అమ్మవారి ఉత్సవమూర్తికి సారె సమర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు,

కనకదుర్గమ్మకు ప్రసాదాల విభాగం సారె

వన్‌టౌన్, జూలై 9 : ఆషాఢమాసం సందర్భంగా దుర్గమ్మవారికి నిర్వహిస్తున్న సారె సమర్పణ క్రమంలో మంగళవారం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రసాదాల తయారీ విభాగం సిబ్బంది, అధికారులు సారె సమర్పించారు. ప్రసాదాల కేంద్రంలో అమ్మవారి ఉత్సవమూర్తికి ఈవో కేఎస్ రామారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డి వద్ద దేవతామూర్తులకు పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా బయలుదేరారు. కొండపైన ప్రసాదాల తయారీ విభాగం ఉద్యోగులు, కుటుంబసభ్యులు, అధికారులు అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం మహామండపంలోని ఆరో అంతస్తులో ఉత్సవమూర్తి వద్ద పూజలు నిర్వహించి సుగంధ పరిమళద్రవ్యాలు, పూలు, పండ్లు తదితరాలతో సారెను సమర్పించారు. పండితులు వారికి ఆశీస్సులు అందజేశారు. డిప్యూటీ ఈవో లీలాకుమార్, ఈఈ రమాదేవి, ఏఈవో పి.చంద్రశేఖర్, శానిటేషన్, ప్రసాదాల తయారీ విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారె సమర్పించిన 786 మంది భక్తులు

దుర్గమ్మకు మంగళవారం విజయవాడకు చెందిన అపరాజిత సేవా భజనమండలి బృందం 200 మంది, ఈవో ఆధ్వర్యంలో 100 మందితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తబృందాలు 786 మంది సారె సమర్పించారు. వారికి అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం మహామండపంలోని ఉత్సవమూర్తి వద్ద పూజాదికాలు నిర్వహించి ఆశీస్సులు అందుకున్నారు.



చెక్‌లు అందజేస్తున్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, తహసీల్దార్ శేషు

బూదవాడ ప్రమాద బాధితులకు చెక్కుల అందజేత

జగ్గయ్యపేట/జగ్గయ్యపేట రూరల్, జూలై 9 : బూదవాడ అల్ట్రాటెక్ ప్రమాదంలో క్షతగాత్రులైన ఏడుగురి కుటుంబసభ్యులకు మంగళవారం నందిగామ ఆర్డీవో రవీంద్రరావు నష్ట పరిహారం చెక్కులను అందజేశారు. బాధితులు గోపీనాయక్, బాలాజీ, బాణావత్ సైదా, పి.అర్జున రావు, బాణావత్‌స్వామి, వేముల సైదులు, ధారావత్ వెంకటేశ్వరరావుల కుటుంబసభ్యులకు ఒక్కొక్కరికి రూ25లక్షల చెక్‌లను అందచేశారు. ఆయనతో పాటు జగ్గయ్యపేట తహసీల్దార్ శేషు ఉన్నారు.

బూదవాడలో మెగా వైద్యశిబిరం



బూదవాడలో మంగళవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి చెందిన సీనియర్ వైద్యులు ప్రజలకు చికిత్స అందించారు. కార్యక్రమంలో జిల్లా డీసీహెచ్ నాయక్, డీఎంహెచ్‌వో సుహాసిని, వైద్యులు శ్రీనివాస్, హరినాద్, సంపత్, నాగేశ్వరరావు, నందిగామ, జగ్గయ్యపేట, బూచవరం, వత్సవాయి పరిధిలోని వైద్యాధికారులు పాల్గొన్నారని బూచవరం వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు.

గ్రామస్థుల నిరసన ..

బూదవాడలో మంగళవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంపై స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఏ కర్మాగారం వ్లల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారో అదే కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆస్పత్రిలో శిబిరం నిర్వహించటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామానికి దూరంగా ఉన్న కంపెనీ ఆస్పత్రి శిబిరానికి వృద్ధులు, చిన్నారులు ఎలా వెళతారని ఆవేదన చెందారు. గ్రామంలో అల్ట్రాటెక్ కర్మాగారం ఏర్పాటు తరువాతనే రోగాల బారిన పడుతున్నామని, గ్రామ పరిస్థితిపై అధ్యయనం చేస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని తెలిపారు. ముందుగా గ్రామంలో ప్రజలకు ఏఏ వైద్య అవసరాలున్నాయో కుటుంబాల వారీగా ఆరా తీసి వారికి కావాల్సిన వైద్యం అందించాలని అభిప్రాయపడ్డారు. దీనిపై వైద్యాధికారి అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అత్యవసరంగా ఏర్పాటు చేశామని కంపెనీ ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు చేసేందుకు పరికాలు ఉండటంతో అక్కడ ఏర్పాటు చేశారని, విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామంలోనే నిర్వహించేలా చూస్తామని తెలిపారు.

గంజాయి బ్యాచ్ అరెస్టు

మైలవరం, జూలై 9 : మైలవరంలో 22 కిలోల సుమారు రూ.80 వేల విలువగల గంజాయిని, ఐదు మోటార్ బైక్‌లతో పాటు ఆరుగురు వ్యక్తులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు మైలవరం పీఎస్‌లో డీసీపీ కె.శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ, మైలవరానికి చెందిన తొమ్మండ్రు అక్షయ్‌కుమార్, గరికపాటి శ్రీహర్ష, మగిశెట్టి యశ్వంత్, వేముల జమలయ్య, షిండే బాజీ, ఇబ్రహీంపట్నంకు చెందిన శివ, నీలేరు పుష్పలంకకు చెందిన ఇస్లావతు జగన్, మధు, టిల్లులతో కలిసి ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ పరిధిలో మోటార్ బైక్‌లను తస్కరించి వాటిని ఏజెన్సీ ప్రాంతంలో విక్రయించి వారి వద్దే గంజాయిని కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తూ జల్సాలు చేస్తున్నారన్నారు. మొత్తం 9 మందిలో ఆరుగురిని అరెస్టు చేయగా ముగ్గురు పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఏసీపీ మురళీమోహన్, సీఐ కిషోర్ బాబు, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.



అనుమంచిపల్లి ఇసుక డంప్ వద్ద నిలిచి ఉన్న ట్రాక్టర్‌లు

కూపన్ల కోసం క్యూ..

ఇసుక కోసం బారులు..

జగ్గయ్యపేట రూరల్ : బడుగు, బలహీన వర్గాల ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక పంపిణీని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని అనుమంచిపల్లి వద్ద ఇసుక పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం పేదలకు ఇసుక లభ్యం కాకుండా కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నేడు ఉచిత ఇసుక ప్రారంభించటంతో లబ్దిదారులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఇసుక ట్రాక్టర్‌లను నడిపి ప్రారంభించారు.

అనుమంచిపల్లి ఇసుక డంప్ వద్ద మంగళవారం ఉదయం నగదు కోసం ఏర్పాటు చేసిన స్కానర్ పని చేయకపోవటంతో దాదాపు ఏడు గంటల పాటు ఇసుక సరఫరా నిలిచిపోయింది. ఇసుక కోసం వచ్చిన వాహనాలు బారులు తీరాయి. ఒంటి గంట నుంచి లబ్దిదారులకు ఇసుక సరఫరా చేశారు.

ఉల్లంఘనలపై ఉక్కుపాదం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన హెచ్చరిక
» కీసర స్టాక్‌యార్డు పరిశీలన



కీసర స్టాక్ యార్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

కంచికచర్ల, జూలై 9 : ఉచిత ఇసుక పంపిణీ విధానం అమలులో లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. కంచికచర్ల మండలం కీసర స్టాక్ యార్డును మంగళవారం ఆమె సందర్శించి పంపిణీ విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నిర్మాణ అవసరాలకు మించి ఇసుక నిల్వ చేసినా, తిరిగి విక్రయించినా లేదా ఇతర రాష్ట్రాలకు తరలించినా జరిమానాతో పాటుగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఇసుక లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం లేకుండా త్వరితగతిన వినియోగదారులకు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిన నామమాత్ర రుసుం మాత్రమే వసూలు చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో కంచెల, మాగల్లు, కొడవటికల్లు, అల్లూరుపాడు, అనుమంచిపల్లి, పోలంపల్లి, కీసర, మొగులూరు డిపోల వద్ద ఇసుక విక్రయాలు జరుగుతున్నాయన్నారు. కీసర స్టాక్ పాయింట్‌లో రెండు లక్షల 25 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. అన్ని స్టాక్ పాయింట్ల వద్ద వినియోగదారులు ఇబ్బందులు పడకుండా తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. స్టాక్ పాయింట్లలో అందుబాటులో ఉన్న ఇసుక ధరలను గనులశాఖ వెబ్‌సైట్లో ఉంచామని, ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు మాత్రమే విక్రయించాలని చెప్పారు. రోజువారి విక్రయాలు, నిల్వ వివరాలను రాత్రి ఎనిమిది గంటలలోపు గనుల శాఖ పోర్టల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇసుక ధరలను స్టాక్ పాయింట్ల వద్ద ప్రదర్శించాలన్నారు. ఒక వ్యక్తి రోజుకు 20 టన్నుల ఇసుక మాత్రమే తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. విక్రయ లావాదేవీలను సీసీ కెమెరాలతో పర్యవేక్షించాలన్నారు. ఒకే బ్యాంకు ఖాతాతో అనుసంధానమై ఉండటం వల్ల లావాదేవీలకు వినియోగించే క్యూ ఆర్ కోడ్ విషయంలో కొంత ఆలస్యమవుతున్నదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. ప్రాథమిక దశలో క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ త్వరితగతిన లోడింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ పేర్కొన్నారు.

కీసర స్టాక్ యార్డు వద్ద ఇసుక కూపన్ల కోసం మంగళవారం సాయంత్రం వినియోగదారులు బారులుతీరారు. ఇసుక కోసం వచ్చిన వారికి అధికారులు ముందుగా కూపన్ల పంపిణీ చేపట్టారు. టన్ను రూ. 290లకే ఇసుక లోడింగ్ చేస్తుండటంతో వినియోగదారులు పోటెత్తారు. దీంతో స్టాక్ యార్డు వద్ద భారీ క్యూ దర్శనమిచ్చింది. విజయవాడ, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, నందిగామ తదితర ప్రాంతాల నుంచి లారీలు, టిప్పర్లు వచ్చాయి. జాతీయ రహదారిపై రెండు వైపులా వాహనాలు బారులు తీరాయి. ఉదయం పది గంటలకు స్టాక్ యార్డు నుంచి సాగర్ కాల్వ వరకు లారీలు, టిప్పర్లు వందల సంఖ్యలో ఉన్నాయి. లోడింగ్ కొద్దిగా ఆలస్యమవుతుందని, గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నదని వాహనాల సిబ్బంది చెపుతున్నారు.

పేట్రేగిపోతున్న మట్టి మాఫియా!



చినపాండ్రాక ఇంతేరు రోడ్డులో భారీ స్థాయిలో నిల్వ చేసిన మట్టి

» వేలాది టన్నుల మట్టి అక్రమ నిల్వలు
» అధికారుల కనుసన్నల్లో.. వైసీపీ నేత అక్రమ దందా!
» పార్టీ పెద్దలకు లక్షల్లో ముడుపులు
» ప్రభుత్వ ఆదాయానికి గండి

బంటుమిల్లి : వైసీపీ ఐదేళ్ల పాలనలో మట్టి మాఫియా వ్యాపారం ద్వారా కోట్లకు పడగలెత్తిన నేతల ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో మట్టి మాఫియా డాన్‌గా పేరొందిన చిన పాండ్రాక గ్రామస్థుడు ప్రజా ప్రతినిధులు, అధికారులను తన గుప్పెట్లో పెట్టుకుని మట్టి మాఫియా డాన్‌గా ఎదిగాడు. అనుమతులు లేని అక్రమ చెరువుల తవ్వకాల నుంచి, ఇతర ప్రాంతాల రైతుల నుంచి మట్టిని తరలించి కొండలను తలపించేలా నిల్వ చేశాడు. చినపాండ్రాక- ఉప్పులూరు రోడ్డు, ఇంతేరు రోడ్డు, పాత ఓఎన్‌జీసి వద్ద సుమారు 30 సెంట్ల నుంచి 50 సెంట్ల స్థలాల్లో వేలాది టిప్పర్ల మట్టిని కొండలుగా పోశాడు. ఇక్కడి నుంచి మట్టి మండలాలు, జిల్లాలు దాటి వెళుతుంది. జేసీబీ, టిప్పర్లు అందుబాటులో ఉంచుకుని అవసరమైన వారికి కావల్సినప్పుడల్లా మట్టిని సరఫరా చేస్తున్నాడు. టిప్పరు రూ.16 వేల నుంచి రూ.25 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. దూరాన్ని బట్టి ధరలు మారుతుంటాయి. ఇంతజరుగుతున్నా గ్రామ, జిల్లా స్థాయి అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకుండా వెళ్లిపోతున్నారు. కొంత మంది అవినీతి అధికారులను తన చేతుల్లో పెట్టుకుని అక్రమ దందాలకు పాల్పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు దారితీస్తున్నది. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ వేలాది టిప్పర్ల మట్టి తరలిపోతున్నాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తన వ్యాపారం సాఫీగా జరిగేందుకు సంబంధిత అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నారనడానికి కొండలను తలపించే మట్టి గుట్టలే సాక్ష్యం. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు సంబంధించిన అధికారులతో లాబీయింగ్ చేస్తూ, ఎలాంటి సమస్యలు రాకుండా చూసేందుకు బంటుమిల్లికి చెందిన ఓ పాత్రికేయుడికి (ఆంధ్రజ్యోతి కాదు) నెలవారీ మామూళ్లు ఇస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ఎన్నికలలో పలువురు రాజకీయ నేతలకు లక్షలాది రూపాయలు పార్టీ ఫండ్‌గా ముట్టచెప్పినట్టు బాహాటంగానే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని పలువురు కోరుకుంటున్నారు.



రైవస్‌కాలువ గండి పూడ్చండి..

మచిలీపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు, ఉంగుటూరు, గుడివాడ తదితర మండలాలకు సాగునీటిని అందించే రైవస్‌కాలువ గండిని త్వరితగతిన పూడ్చాలని రైతులు కోరుతున్నారు. కోమటిగుంట లాకులకు రెండు కిలోమీటర్ల దిగువన రైవస్‌కాలువకు గతేడాది డిసెంబరు నెలలో మిచౌంగ్‌తుపాను కారణంగా కురిసిన వర్షాలకు భారీగా వర్షపునీరు చేరడంతో ఈ కాలువ గట్టుకు గండిపడింది. ఈ గండిని జూలై నెలవచ్చినా ఇంకా పూడ్చలేదు. 12మీటర్ల పొడవుతో ఏర్పడిన ఈ గండిని పూడ్చకపోవడంతో కొద్ది రోజుల్లో రైవస్‌కాలువకు సాగునీటిని విడుదలచేస్తే సాగునీరు పక్కనే ఉన్న చంద్రయ్యకోడు డ్రెయిన్‌లోకి వెళ్లిపోతుందని, దీంతో దిగువ భూములకు సాగునీరు అందదని రైతులు చెబుతున్నారు. కాలువలకు సాగునీటిని విడుదల చేసేలోగా ఈ గండిని పూడ్చుతామని, ఈ పనులు చేసేందుకు రూ.4లక్షలతో అంచనాలు రూపొందించినట్టు నీటిపారుదల శాఖ డీఈ భరత్ తెలిపారు.

పంట నష్టపోనివ్వం : కలెక్టర్



ఆనకట్ట మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

వత్సవాయి, జూలై 9: ఈ ఏడాది రైతులు పంట నష్టపోకుండా మూనేరు నుంచి సాగునీటిని అందిస్తామని కలెక్టర్ సృజన స్పష్టం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్‌తో కలిసి పోలంపల్లి వద్ద తెగిపోయిన మునేరు ఆనకట్టను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ, మూనేరు నుంచి రైతులకు సాగునీటిని అందించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఇరిగేషన్ అధికారులను గండి పూడ్చేందుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గండి పూడ్చివేత వల్ల ఖమ్మం జిల్లా పెదమండవ గ్రామానికి చెందిన రైతులు నష్టపోతే నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. 2004లో ప్రారంభించిన నూతన డ్యామ్ నిర్మాణం జరిగినా టెక్నికల్ వర్క్ పూర్తి కాలేదన్నారు. 2012లో వరదలకు కొత్త డ్యామ్‌కు పడిన గండిని పూడ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ, సకాలంలో సాగునీటిని అందించేందుకు చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టినట్టు చెప్పారు. రోడ్డు కమ్ బ్రిడ్జ్‌ని పూర్తిగా వినియోగంలోకి తీసుకువస్తే రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగుతాయన్నారు. సీపీఎం నాయకులు చిరిమామిళ్ల హనుమంతరావు, టీడీపీ నేత వెగినేటి గోపాలకృష్ణ మూర్తి తదితరులు నూతన బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి చేసి రైతుల్ని ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేసీ సంపత్‌కుమార్, ఈఈ గంగయ్య టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను నిర్బంధించిన వీఆర్వో

» న్యాయం చేయాలని కొడుకుతో కలిసి కార్యాలయం ఎదుట నిరసన
» సరెండర్ లెటర్ చూసి ఆక్రోశం.. -తహసీల్దార్



కుమారుడితో నిరసన తెలుపుతున్న వీఆర్వో నాగమలేశ్వరితో చర్చలు జరుపుతున్న సీఐ

ఘంటసాల, జూలై 9 : కృష్ణా జిల్లా ఘంటసాల తహసీల్దార్ కార్యాలయం ఎన్.బి.విజయలక్ష్మిని ఘంటసాలపాలెం వీఆర్వో నాగమల్లేశ్వరి మంగళవారం ఉదయం నిర్బంధించింది. ఉదయం 11 గంటల సమయంలో కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి వచ్చిన వీఆర్వో నాగమల్లేశ్వరి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లి అక్కడే ఉన్న కొడాలి వీఆర్వో యువరాజ్‌పై చెప్పుతో దాడికి యత్నించింది. ఈ విషయమై తహసీల్దార్ ప్రశ్నించగా, కార్యాలయ తలుపులు మూసేసింది. తహసీల్దార్ సర్దిచెబుతున్నప్పటికీ వినకుండా ఆక్రోశాన్ని వెళ్లగక్కటంతో తహసీల్దార్ విజయలక్ష్మి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది రూమ్ తలుపులు తెరవమనటంతో వీఆర్వో రూము తలుపులు తెరిచి తన తోపాటు తెచ్చుకున్న పెట్రోల్‌ను గోడలపై పోసి.. అక్కడే కుమారుడితో కలిసి బైఠాయించి నిరసన తెలియజేసింది. చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్ఐ చిన బాబులు పలుమార్లు వీఆర్వో నాగమల్లేశ్వరితో మాట్లాడినప్పటికీ ఆమె నిరసనను కొనసాగించింది.

వివరాలు పరిశీలిస్తే.. గత తహసీల్దార్ రామానాయక్ హయాంలో కొంతమంది వీఆర్వోలు తన లాగిన్‌లోకి వెళ్లి తన పరిధికి సంబంధించిన సర్టిఫికెట్లు, పాస్ పుస్తకాలు తదితర రెవెన్యూ విధులన్నీ తనకు సంబంధం లేకుండా జారీ చేస్తున్నారని ఘంటసాల పాలెం వీఆర్వో నాగమల్లేశ్వరి జేసీ, ఆర్డీవోకి ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన అధికారులు అప్పటి తహసీల్దార్, వీఆర్వోలను విచారించి వారి నుంచి సమాచారం సేకరించారు. ఈ విషయమై పూర్తి నివేదిక ఇవ్వాలంటూ ఘంటసాల తహసీల్దార్ విజయలక్ష్మిని ఆదేశించగా, తహసీల్దార్ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. దీంతో వీఆర్వో నాగమల్లేశ్వరిని ఆర్డీవో కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. విషయం తెలుసుకున్న వీఆర్వో నాగమల్లేశ్వరి తనకు ఈ దుస్థితి రావటానికి కారణం నువ్వేనంటూ కొడాలి వీఆర్వో యువరాజ్‌పై దాడికి యత్నించింది. ఎంత నచ్చజెప్పినా వినని నాగమల్లేశ్వరి ఆర్డీవో వచ్చి సమాధానం చెప్పాలని భీష్మించుకుని కూర్చుంది. దీంతో సీఐ నాగప్రసాద్ కలెక్టర్ సీసీలో ఫోన్‌లో మాట్లాడించినప్పటికీ వినని నాగమల్లేశ్వరి తన నిరసన కొనసాగించి సాయంత్రం 3.30 గంటల సమయంలో వెళ్లిపోయింది.

నాకు అన్యాయం జరిగింది : వీఆర్వో

ఘంటసాలపాలెం వీఆర్వోగా గత కొంతకాలంగా సేవలందిస్తున్నాను. తహసీల్దార్ రామానాయక్ హయాంలో ఆయన సహకారంతో కొంతమంది వీఆర్వోలు తన లాగిన్ నుంచి సర్టిఫికెట్లు జారీ చేయటం, తనకు సహకరిస్తున్న తన కుమారుడిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. కాళ్లు అరిగేలా తిరుగుతున్నా, నేటికీ న్యాయం జరగలేదు.

ఆర్డీవో ఆఫీస్‌కు వీఆర్వో సరెండర్

ఆర్డీవో కార్యాలయానికి ఘంటసాలపాలెం వీఆర్వో నాగమల్లేశ్వరిని సరెండర్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్టు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. గతంలో తహసీల్దార్‌కు, కొంతమంది వీఆర్వోలకు, ఘంటసాలపాలెం వీఆర్వో నాగమల్లేశ్వరి ఒకరిపై ఒకరు చేసిన ఆరోపణలపై ఉన్నతాధికారులు నివేదిక అందించాలని కోరటంతో తాను నివేదిక అందించానన్నారు. ఈ మేరకు వీఆర్వోకు సరెండర్ ఉత్తర్వులు రాగా, మంగళవారం కార్యాలయానికి వచ్చిన నాగమల్లేశ్వరి తనముందే కొడాలి వీఆర్వో యువరాజ్‌పై చెప్పు చూపిస్తూ దురుసుగా ప్రవర్తించి రూమ్ తలుపులు వేసిందని తెలిపారు. దీంతో పోలీసులకు సమాచారం అందించానన్నారు.



హత్య కేసు నిందితులతో ఏఎస్పీ వెంకటేశ్వరరావు

భర్తను కడతేర్చిన భార్య, నిందితుల అరెస్టు

మచిలీపట్నం టౌన్, జూలై 9 : వివాహేతర సంబంధం నేపథ్యంలో కట్టుకున్న భర్తనే హత్య చేసిన భార్య ఆమెకు సహకరించిన వారిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్పీ కార్యాలయం వద్ద ఏఎస్పీ వెంకటేశ్వరరావు నిందితులను హాజరుపరిచారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఏఎస్పీ జి. వెంకటేశ్వరరావు కేసు వివరాలు తెలిపారు. ప్రియుడితో కలిసి కొంత మంది సహకారంతో భర్తను హత్య చేసిన ఈ కేసును త్వరితగతిన ఛేదించామన్నారు. బంటుమిల్లికి చెందిన చిగురుశెట్టి సుభాష్ చంద్రబోస్ ఉల్లిపాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడి భార్య శిరీష ఏలూరు జిల్లా ఎన్‌కెపల్లి గ్రామానికి చెందిన తిరుమలశెట్టి పరశురామయ్యతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ క్రమంలో భర్త అడ్డుగా ఉంటున్నాడని, హతమార్చాలని పథకం పన్నింది. ప్రియుడితో ఈ విషయం చెప్పింది. ప్రియుడు, మరో ముగ్గురితో కలిసి సుభాష్‌చంద్రబోస్‌కు పెదపట్నం నుంచి ఫోన్ చేస్తున్నామని, ఉల్లిపాయలు కావాలని, కిరాయి కూడా ఇస్తామని చెప్పారు. ఉల్లిపాయల మూటలు తీసుకుని పెదపట్నం వెళుతుండగా పథకం ప్రకారం 5వ తేదీ రాత్రి 7 గంటలకు బంటుమిల్లి మండలం నారాయణపురం గ్రామంలో స్మశానవాటిక దగ్గరకు సుభాష్‌చంద్రబోస్ రాగానే వెనుక నుంచి బైక్‌పై ముగ్గురు ఆటో దగ్గరకు వచ్చి ఐరన్ పైపులతో విచక్షణారహితంగా తల, ముఖంపై కొట్టారు. 108 అంబులెన్స్‌లో సుభాష్ చంద్రబోస్‌ను బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కేసులో నిందితులైన తిరుమలశెట్టి పరశురామయ్య, భార్య శిరీష, నిడమర్రు మండలం భువనపల్లి గ్రామానికి చెందిన కిల్లా హేమంతకుమార్, భీమవరానికి చెందిన కోడిగుడ్ల మౌళి, ఏలూరు జిల్లా భువనపల్లి గ్రామానికి చెందిన జువైనల్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కేసు ఛేదించిన పెడన, బంటుమిల్లి, గూడూరు ఎస్ఐ నాగేంద్ర కుమార్, వాసు, వీర్రాజులకు ఏఎస్పీ వెంకటేశ్వరరావు, డీఎస్పీ అబ్దుల్ సుభాన్‌లకు రివార్డులు అందజేశారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం : మంత్రి సవిత

గొల్లపూడి, జూలై 9 : బీసీల పునాదుల మీద ఉద్భవించిన పార్టీ టీడీపీ అని, బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమశాఖ భవనాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీలను వైసీపీ కేవలం ఓటు బ్యాంకుగానే చూసి అణచివేసిందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

అభయాంజనేయస్వామి దర్శించుకున్న ఏలూరు ఎంపీ



హనుమాన్‌జంక్షన్, జూలై 9: స్థానిక అభయాంజనేయ స్వామిని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ మంగళవారం దర్శనం చేసుకున్నారు. విజయవాడ నుంచి ఏలూరు వెళ్తూ మార్గమధ్యలో ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి ఆశీస్సులు అందించారు. ఈవో కె.శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో శేష వస్త్రాన్ని కప్పి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.



కుంకుమార్చనలో భక్తులు

వైభవంగా కోటి కుంకుమార్చన

శాయిపురం(ఉయ్యూరు), జూలై 9 : వారాహి నవ రాత్రులు పురస్కరించుకుని శాయిపురం రామేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక కోటి కుంకు మార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఈ నెల 15 వరకు కోటి కుంకుమార్చన పూజలు జరుగుతాయని జొన్నవిత్తుల వెంకటప్పయ్య, కోట వెంకట సుబ్బరామన్, చావలి సీతారామాంజనేయులు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చేసి రూ.53వేలు అపహరణ

హనుమాన్‌జంక్షన్, జూలై 9 : స్థానిక విజయవాడ రోడ్డులోని ఏటీఎంలో నగదు డ్రా చేస్తున్న మహిళ వద్ద ఏటీఎం కార్డు మార్చేసి ఆమె ఖాతాలో ఉన్న రూ.53వేలు అపహరించిన వైనం మంగళవారం వెలుగు చూసింది. స్థానిక ఇందిరా నగర్ కాలనీకి చెందిన నాగెళ్ల మేరీ గత నెల 30న డబ్బులు డ్రా చేద్దామని ఏటీఎంకు వెళ్లి గుర్తు తెలియని యువకుడి చేతికి కార్డు ఇచ్చి తానే పిన్ కోడ్ కొట్టి రూ.500లు డ్రా చేసింది. ఈ నేపథ్యంలో ఆ యువకుడు పిన్ నెంబర్ తెలుసుకొని ఆమె చేతిలో ఉన్న ఏటీఎం కార్డును మార్చి వేరొక ఏటీఎం కార్డును చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. ఆ తరువాత వరుసగా నాలుగు రోజులు పాటు ఏటీఎం కార్డును వినియోగించి ఖాతాలో ఉన్న నగదును అపహరించాడు. సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తున్నా పట్టించుకోని బాధితురాలు ఈ నెల 6వ తేదీన డబ్బులు డ్రా చేద్దామని వెళ్లి తన వద్ద ఉన్న కార్డుపెట్టి ప్రయత్నం చేసింది. కార్డు మారిపోయినట్లు గమనించి బ్యాంకు అధికారులను సంప్రదించి తన ఖాతా వివరాలను తెలుసుకోగా ఖాతాలో ఉన్న రూ. 53,000లు అపహరించినట్లు గ్రహించి నిర్ఘాంత పోయింది. తన చేతిలో ఉన్నది దొంగ కార్డుని గ్రహించి కన్నీరు పర్యంతమైంది. దీంతో మంగళవారం బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

నూతన కార్యవర్గం



నూతన కమిటీ అధ్యక్షురాలిగా గుర్తింపుపత్రం అందుకుంటున్న ధనేకుల వీణ

ఉయ్యూరు, జూలై 9 : వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం ఏక గ్రీవంగా ఎన్నికైంది. మచిలీపట్నంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా ధనేకుల వీణ, ప్రధాన కార్యదర్శిగా ఈ.వెంకటరావు, కోశాధికారిగా ఎం.వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా సీహెచ్ మల్లిబాబు, జె. చింతయ్య, టి. దీపిక డానియేల్, జాయింట్ సెక్రటరీగా ఎం. దుర్గాభవాని, పి.మనోజ్, హెచ్. జయంత్ ఎన్నికైనట్లు వీణ తెలిపారు.

అభయాంజనేయస్వామికి పూజలు

హనుమాన్‌జంక్షన్, జూలై 9 : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళ వారం పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు అభయాంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఏలూరుకు చెందిన బాలసాని కృష్ణారావు గురవమ్మ దంపతులు ఆలయంలో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమానికి వితరణ చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో కె.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు సాయం అందజేస్తున్న ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు

ఉయ్యూరు, జూలై 9 : లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి, పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని విద్యనభ్యసించిన కళాశాల, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు న్వరా సుధారాణి అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ చదువుతున్న నలుగురు విద్యార్థినులకు తనతోపాట క్లబ్ సభ్యులు అన్నే రాణి, కొడాలి కనకదుర్గ సమకూర్చిన రూ. 15 వేలను నలుగురు పేద విద్యార్థినులకు మంగళవారం అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

12న జరిగే రథయాత్రకు రండి

విద్యాధరపురం, జూలై 9: ఇస్కాన్ విజయవాడ ఆధ్వర్యంలో ఈ నెల 12న నగరంలో జరగనున్న శ్రీ జగన్నాథ రథయాత్రకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని ఇస్కాన్ విజయవాడ ప్రతినిధులు ఆహ్వానించారు.

మంగళవారం గురునానక్ కాలనీలోని ఎన్‌టీఆర్ భవన్‌లో ఎంపీ కేశినేని చిన్నిని ఇస్కాన్ విజయవాడ వైస్ ప్రెసిడెంట్ వేణుధారి కృష్ణదాస్, పీఆర్‌వో శ్యామ్ సుందర్ అచ్యుత్ దాస్‌లు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఉచిత ఇసుక పాలసీ

రాష్ట్ర ప్రగతికి బాట

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకి టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 9 : టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట అని రాష్ట్రంలోని పేదలకు, భవన నిర్మాణ కార్మికులకు లబ్ధి చేకూరనుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పోరంకిలోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన ఇసుక పాలసీలో అక్రమాలు, దోపిడీలను అరికట్టేందుకు గత ఇసుక పాలసీని పూర్తిగా రద్దు చేసి ఉచిత ఇసుక పాలసీని అమల్లోకి తెచ్చామని పేర్కొన్నారు. సామాన్యుడు తన ఇంటి నిర్మాణం కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఇసుకను ఉచితంగా అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వర్షాకాలంలో ఓపెన్ క్వారీలను అనుమతించకపోవడంతో ఇసుక సరఫరాలో చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నాయని, అక్టోబరు, నవంబరు నెలల్లో ఇబ్బందులు తీరతాయని తాము భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు మూడు వేల నుంచి నాలుగు వేలకు పెన్షన్‌ను పెంచి, గత మూడు నెలల బకాయిలు మూడువేలను కలిసి ఇచ్చిన ఘనత తమకే దక్కిందన్నారు. గత ప్రభుత్వం సరైన ఇసుక పాలసీని ప్రకటించకపోవడంతో ఉపాధి లేక రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వందల మంది భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకొన్న సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ఉన్న స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను రవాణా, లోడింగ్ ఛార్జీలు చెల్లించి వినియోగదారులు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. వచ్చే కొద్ది రోజుల్లోనే డిమాండ్, సరఫరాల మధ్య సమతూకం ఏర్పడి డిమాండ్‌కు తగ్గట్లు ఇసుక సరఫరా చేసే అవకాశం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నదిలో నుంచి డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను తీయడంతో కొంత ఖర్చు వినియోగదారుడు భరించాల్సిరావచ్చని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఎన్జీటీ నిబంధనలకు తూట్లు పొడవడంతో వ్యవస్థలను గాడిలో పెట్టే పనిలో ప్రభుత్వం ఉందని, ఈక్రమంలో చిన్నచిన్న సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, సమస్యలను అధిగమించి వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ జనసేన బాధ్యుడు ముప్పా రాజా మాట్లాడుతూ, నిర్మాణ రంగానికి ఆయువుపట్టయిన ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిన చంద్రబాబుకు, పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్‌ప్రసాద్, కొమ్మినేని వెంకటేష్, ద్రోణవల్లి సుబ్బారావు, అంగిరేకుల మురళి, తాతపూడి గణేష్, శొంఠి శివరాంప్రసాద్, సంగెపు రంగారావు, పీతా గోపీచంద్, షేక్ సమీర్ పాల్గొన్నారు.

రక్షణ కవచం హెల్మెట్

ట్రాఫిక్ ఏసీపీ జనార్దన్

గుణదల, జూలై 9 : ద్విచక్రవాహనాలపై ప్రయాణాలు చేసే వారికి హెల్మెట్ రక్షణ కవచమని ట్రాఫిక్ ఏసీపీ జనార్దన్ అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ఎదురయ్యే సమస్యలు, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయంలో జరిగే ఉప యోగాల గురించి అవగాహన ర్యాలీని ఎస్ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో మంగళవారం నిర్వహించారు. రామవరప్పాడు రింగ్ వద్ద నుంచి ఎనికేపాడు తాడిగడప రోడ్డు వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, ఎస్. సత్యనారాయణ, ఎస్ఐ ఆదినారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లి జంక్షన్‌లో..

గన్నవరం(ఉంగుటూరు) : ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో అది ప్రాణరక్షణ కలిగిస్తుందని గన్నవరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వాసా పెద్దిరాజు అన్నారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య ఆదేశాల మేరకు మంగళవారం గన్నవరం మండలం కేసరపల్లి నాలుగురోడ్ల కూడలి వద్ద హెల్మెట్ వలన కలిగే లాభాలపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా ద్విచక్రవాహనాలు నడిపే మైనర్ల నుంచి వాహనాలను స్వాధీనం చేసుకుంటామని, వారి తల్లిదండ్రులపై లేదా సంరక్షకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ప్రజలు, వాహనచోదకులు పాల్గొన్నారు.



కేసరపల్లి జంక్షన్‌లో హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పెద్దిరాజు

సీసీఆర్సీ కార్డులతో కౌలురైతులకు మేలు



కౌలురైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉంగుటూరు, జూలై 9 : పంటసాగు హక్కు ధ్రువీకరణపత్రాలు (సీసీఆర్సీ కార్డులు) పొందిన కౌలురైతులకు మేలు జరుగుతుందని, మండలంలోని కౌలురైతులందరూ తప్పనిసరిగా క్రాప్ కల్టివేషన్ రైట్ సర్టిఫికెట్స్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జేవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం తేలప్రోలు ఆర్బీకేలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సీసీఆర్సీ కార్డులపై కౌలురైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ, సీసీ ఆర్సీ కార్డుల జారీ ప్రక్రియలో రైతులు, కౌలురైతులకు మధ్య సఖ్యత, సాగుసంబంధమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతులకు, కౌలురైతులకు మధ్య భూయజమానుల హక్కులకు భంగం కలుగకుండా, వారి అంగీకారంతోనే కౌలుదారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోరా వీఆర్వో ఏ.సునీల్‌కుమార్ వీఏఏలు రాంప్రసాద్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

● మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం

వన్‌టౌన్, జూలై 9: ఇతర ప్రాంతాల నుంచి దొంగచాటుగా గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్న ఏడుగురు నిందితులను సూర్యారావుపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. స్టేషన్ పరిధిలోని పున్నమ్మతోట వద్ద నిందితులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోమవారం పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి మూడున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లా యనమలకుదురు లాకుల వద్ద ఉంటున్న కూసం వెంకట దినేష్ కుమార్ అలియాస్ కేవీ (21), భూక్యా స్వరాజ్ అలియాస్ మాణిక్యం అలియాస్ నాని(23), దమ్ము కిరణ్ జోజి అలియాస్ గని(20), యనమలకుదురు భగత్‌సింగ్‌నగర్‌లో ఉంటున్న కొడాలి డోలాస్‌కుమార్ అలియాస్ డాడి (20), కొల్లి భానుప్రకాష్ అలియాస్ భాను (19), తిమ్మసర్తి కార్తీక్ అలియాస్ కార్తీక్ (23), మోస సేతు (19)లను కోర్టుకు హాజరుపరిచారు. కోర్టు రిమాండ్ విధించింది.

రైతుబజార్‌లో తక్కువ ధరలకే నిత్యావసరాలు

పటమట, జూలై 9 : రాష్ట్రవ్యాప్తంగా రైతుబజార్ల ద్వారా నిత్యావసర వస్తువులను ప్రజలకు బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరలకు అందించే కార్యక్రమం గురువారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం అవుతుందని పటమట రైతుబజార్ ఎస్టేట్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు ఏపీఐఐసీ కాలనీ రైతుబజార్‌లో గురువారం నుంచి అమ్మకాలు ప్రారంభిస్తున్నామన్నారు.

తాడిగడప మునిసిపాలిటీ ఏర్పాటు తప్పే

వైసీపీ సీనియర్ నేత చిట్టిబాబు వివాదాస్పద వ్యాఖ్యలు

పెనమలూరు, జూలై 9 : వైసీపీ నేతలు తాడిగడప మునిసిపాలిటీని ఏర్పాటు చేసి పెద్ద తప్పు చేశారని కానూరుకు చెందిన వైసీపీ సీనియర్ నేత అన్నే చిట్టిబాబు చేసిన తీవ్ర వ్యాఖ్యలు తమ స్వంత పార్టీ నేతలను ఇరుకున పడేశాయి. సోమవారం కానూరులో వైఎస్సార్ జయంతి సందర్భంగా చిట్టిబాబు చేసిన వ్యాఖ్యలు స్థానికంగా, సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. చిట్టిబాబు మాట్లాడుతూ తాడిగడప మునిసిపాలిటీ ఏర్పాటుకు ముందు తాము లక్షల వ్యయంతో కానూరు గ్రామ స్మశానాన్ని అభివృద్ధి చేశామని, తర్వాత కనీసం స్మశాన అభివృద్ధిని చూసిన నాథుడే లేడన్నారు. కానూరును మరో మూడు గ్రామాలను కలిపి హడావుడిగా వైసీపీ నేతలు మునిసిపాలిటీని ఏర్పాటు చేశారేగానీ, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడంతో ఆయా గ్రామాల్లో టీడీపీ 30వేల ఓట్ల పైచిలుకు మెజారిటీ సాధించిందన్నారు. కానూరులో రెండు కుటుంబాల కబంధ హస్తాల నుంచి ప్రజలు బయట పడ్డారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.



కానూరులో జరిగిన వైఎస్సార్ జయంతిలో మాట్లాడుతున్న అన్నే చిట్టిబాబు

పోలీసుల అదుపులో వైసీపీ నేతలు



హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 9 : వైసీపీ అధికారంలో ఉండగా నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నేతలు, పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వారితో పాటు పోత్సహించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం గన్నవరం టీడీపీ కార్యాల యంపై దాడి చేసిన వారితో పాటు ప్రోత్సహించిన 46మందిపై ఎట్టకేల కు పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. బాపులపాడు మండలానికి చెందిన కొందరు వైసీపీ నాయకులతో పాటు ప్రజాప్రతినిధులను కూడా దర్యాప్తు నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లడం దీనికి ఊతమిస్తోంది. ఇదే సమయంలో వైసీపీ ముఖ్య నేతల ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసి ఉన్నాయి. గన్నవరం, బాపులపాడు మండలాలకు చెందిన ఎంపీపీ యరగొర్ల నగేష్, కొల్లి చిట్టి, తిప్పగుంట పీఏసీఎస్ మాజీ అధ్యక్ష డు మూల్పూరు ప్రభుకాంత్, డొక్కు సాంబశివవెంకన్న, పడమట నాగరాజులతో పాటు మాజీ ఎమ్మెల్యే వంశీ డ్రైవర్ దుర్గారావు, మరో 6గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సీసీ ఫుటేజీలు, వీడియోల ఆధారంగా మిగతావారి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

పంచాయతీరాజ్ అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశం



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, జూలై 9 : గన్నవరం నియోజకవర్గంలో పంచాయతీరాజ్ విభాగంలోని పెండింగ్ పనులపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం రాత్రి నియోజకవర్గ పంచాయతీరాజ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో పలుగ్రామాలకు వెళ్లే రహదారులు ధ్వంసం అయ్యాయని, వాటికి తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో అంతర్గత రహదారులను సీసీ రోడ్లగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావటంతో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. పెండింగ్ పనులపై అధికారులను ఆరా తీసిన ఎమ్మెల్యే ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. బాపులపాడు మండలం రంగయ్య అప్పారావుపేట గ్రామానికి వెళ్లే రహదారి పునర్నిర్మాణ పనులు సత్వరమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ పి.సురేష్, పీఐయూడీ ఈ.భవాని, ఏఈలు డి.జయరాజు, సీహెచ్ దాసు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యార్లగడ్డ



రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌ను గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ గన్నవరం నియోజకవర్గంలో నెలకొన్న అపరిష్కృత సమస్యల గురించి మంత్రి లోకేశ్‌కు వివరించారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వంనుంచి ఎలాంటి భరోసా లభించక సామాన్యులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యారని లోకేశ్‌కు తెలిపారు. ఈక్రమంలో ప్రజలకు భరోసా కల్పిస్తూ, సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా గన్నవరం నియోజకవర్గంలో పారిశ్రామిక రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.55

మహిళా చైతన్యంతోనే అభ్యున్నతి: ఐసీడీఎస్ పీడీ

పెడన, జులై 9 : మహిళా చైతన్యంతోనే అభ్యున్నతి ఆధారపడి ఉందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సువర్ణ అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ ప్రార్థనా మందిరంలో మిషన్ స్త్రీ శక్తి పథకంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ, మహిళల రక్షణ కోసం, వారి హక్కులను కాపాడటం కోసం ప్రభుత్వం మిషన్ స్త్రీ శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ సెంటర్ ద్వారా బాధిత మహిళలు, బాలికలు అవసరమైన సహాయం పొందవచ్చన్నారు. ఓఎస్‌సి అచ్చిష్మ, సీపీడీపీవో సముద్రవేణి, సహాయ ఫౌండేషన్ ఛైర్మన్ ఎండీ ఉస్మాన్ బాషా, నోడల్ ఆఫీసర్ పద్మావతి, ఖుర్షిద్ బేగం పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులు రెన్యూవల్ చేసుకోవాలి

కూచిపూడి, జులై 9 : 2024-25 విద్యా సంవత్సరానికి జోన్ -2 పరిధిలో కాంట్రాక్టు అధ్యాపకులు రెన్యూవల్ చేయించుకోవాలని జిల్లా ఐడెంటిఫైడ్ కళాశాలైన వేమూరు సుందరామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రధాన అచార్యులు డాక్టర్ ఎస్.మాధవి సూచించారు. గత విద్యాసంవత్సరంలో ఏప్రిల్ 30 వరకు పనిచేసిన ఒప్పంద అధ్యాపకులు మాత్రమే రెన్యూవల్ చేసుకోవటానికి అర్హులని తెలిపారు. వారందరూ ఈ నెల 11 లోపల దరఖాస్తులు దాఖలు చేయాలని, సాయంత్రానికి వచ్చిన దరఖాస్తులను సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కి సమర్పించాలని వివరించారు. ఈ నెల 15న జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే కౌన్సెలింగ్‌లో రెన్యూవల్ చేసుకున్న అధ్యాపకులు హాజరవ్వాలని పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి రెన్యూవలైన ఒప్పంద అధ్యాపకులు ఈ నెల 16న అగ్రిమెంట్ రాయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

నేడు తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన

గుడివాడ : కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం అమలు చేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి ఆరోపించారు. సుందరయ్య భవన్‌లో మంగళవారం మాట్లాడుతూ అనేక పోరాటంతో సాధించుకున్న 44 కార్మిక చట్టలను నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడ్‌లు మార్చారన్నారు. ఈ నెల 10న కార్మిక సంఘాలు డిమాండ్స్ డే నిర్వహిస్తున్నాయన్నారు. తహసీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ఈ కార్యక్ర మంలో కార్మికులు, ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వారు పాల్గొని విజ యవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో బిల్డింగ్ వర్కర్స్‌యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రేపాని కొండ, పట్టణాధ్యక్షుడు మూడెడ్ల నారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు వేసిన విద్యార్థులు


వరినాట్లు వేస్తున్న విద్యార్థులు

పెదపారుపూడి, జులై 9 : వెంట్రప్రగడ గ్రామంలోని టీడీపీ రైతు నాయకుడు జాజుల ప్రసాద్ పొలంలో విద్యార్థులకు వరి నాట్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. కలవపాముల థెరిస్సా ఎడ్యుకేషనల్ అకాడమీ విద్యాసంస్థల 9, 10 తరగతి విద్యార్థులకు మంగళవారం వరి నాట్లు వేసే కూలీలతో కలపి వరి నాట్లు వేయించారు. ఈ సందర్భంగా రైతు జాజుల ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ పనులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హేమంత్, నాగనబోయిన చింతయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా అడపా బాజ్జీ జయంతి

గుడివాడ : మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ అడపా బాబ్జీ జయంతి సందర్భంగా మంగళవారం శాంతి వృద్ధాశ్రమంలో అభిమానులు వృద్ధులకు భోజన, పండ్లు పంపిణీ చేశారు. తొలుత కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.ఎ. ప్రసాద్, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పామర్రు, జులై 9 : పామర్రు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంత్సవరానికి బీఏ, బీకాం కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. విలేకర్లతో మంగళవారం మాట్లాడుతూ హెల్ప్ లైన్ నెంబరు 94940 55776 ఏర్పాటు చేశామని, వివరాలు తెలుసుకోవచ్చునని ఆయన తెలిపారు.

సూపర్ సిక్స్ తప్పనిసరిగా అమలు : రావి

గుడివాడ : టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్‌ను తూచా తప్పకుండా అమలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజావేదికలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఇసుక దోపిడీ చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానంతో పేదవర్గాలు గృహ నిర్మాణాలు, నిర్మాణ రంగం ఊపందుకుంటుందన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దారం నరసింహారావు, రామధేను వేణుబాబు, పోలాసి ఉమా తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

నాగాయలంక, జులై 9 : జిల్లాలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడుల్లో నిందితులను తక్షణమే అరెస్టు చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావుకు తెలు గు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత మంగళవారం కార్యాలయంలో కలిసి వినతి చేశారు. అనంతరం ఆమె పుష్పగుచ్ఛం ఇచ్చి వారిని అభినందించారు.

ఎండు చేపల మార్కెట్‌లో వసతులకు కృషి


మార్కెట్‌ను పరిశీలిస్తున్న ప్రతిభ

నాగాయలంక, జులై 9 : నాగాయలంకలో ఎండు చేపల మార్కెట్‌లో మహిళా మత్స్యకా రులు ఎదుర్కొంటున్న సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రతిభ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెటింగ్ కో-ఆపరే టివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి, జిల్లా మత్స్య సహకార సంఘం మాజీ డైరెక్టర్ నాగిడి తాతారావు పరిశీలించారు. వసతి సదుపాయాలతో కూడిన భవనం, ప్లాట్‌ఫారంల నిర్మాణానికి మత్స్యశాఖ నుంచి నిధులు మంజూరు చేయించాలని వారు అధికారిణికి విన్నవించారు.

సముద్రపు నాచుతో బహుళ ప్రయోజనాలు


నాచును పరిశీలిస్తున్న నిపుణుల బృందం

నాగాయలంక, జులై 9 : కప్ప ఫైకస్ అనే సముద్రపు నాచు వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని గుజరాత్‌కి చెందిన ఆయిల్ రామర్ విభూషణ్, హరి శంకర్ తివాకర్ తెలిపారు. మంగళవారం నాగాయ లంక లోని కృష్ణానదిలో మత్స్యశాఖ అధికారులు, సిబ్బందితో కలిసి వారు ప్రయాణం చేసి సముద్రపు నీటిలోని నాచును, అనుకూలతను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడు తూ కప్ప ఫైకస్ సముద్రపు నాచు పెంపకానికి నాగాయలంక, కోడూరులోని సముద్ర తీర ప్రాంతాలు సానుకూలంగా ఉంటాయని వెల్లడించారు. అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఆర్.ప్రతిభ, అవనిగడ్డ, నందివాడ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎం.రవికుమార్, గ్రామ మత్స్య సహాయకులు, తలశిల రఘుశేఖర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ

మోపిదేవి/ అవనిగడ్డ, జులై 9 : మోపిదేవి మండలం బొబ్బర్లంక గ్రామంలో, అవనిగడ్డ గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర్ పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహ కాలు ఇస్తున్నట్లు అవనిగడ్డ ఉద్యాన శాఖాధికారి రమేష్ తెలిపారు. గ్రామ సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, రైతులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు.

ముళ్లపొదలు తొలగింపు

కోడూరు, జులై 9 : స్థానిక మండలం ఇరాలి గ్రామం నుంచి రామకృష్ణాపురం వెళ్లే ప్రధాన రహదారి వెంబడి సుమారు నాలుగు కిలోమీటర్లు రోడ్డుకిరువైపులా ఉన్న తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలను జనసేన యువ నేత బచ్చు వెంకటేష్ తన సొంత నిధులతో తొలగించారు. ఆ రోడ్డులో తుమ్మ చెట్లు, పిచ్చి మొక్కలు మొలిచి రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందని గ్రామస్థుల వినతి మేరకు ఆయన స్పందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, బచ్చు వెంకటేష్, గోగినేని సోమశేఖరరావు, ఉల్లి శేషగిరి, పిల్లి మల్లిఖార్జునరావు, అద్దంకి పాండురంగారావు, కోట మణికంఠ, యాదాల సాయి కిరణ్ పాల్గొన్నారు.

మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు

నాగాయలంక, జులై 9 : భారీ వర్షం మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కురిసింది. గంటకుపైగా కురిసిన వానకు రోడ్లకిరువైపులా నీరు నిలిచింది. కురిసిన వర్షం 25.8 మిమీగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. నైరుతి పవనాలు ప్రవేశించిన తర్వాత మండలంలో అధిక వర్షపాతం నమోదు కావటం ఇదీ రెండోసారి.

ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీ

రాష్ట్ర ప్రగతికి సోపానం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య


ఆర్టీసీ బస్టాండ్ వద్ద చంద్రబాబు, పవన్‌కల్యాణ్, కొల్లు రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ నాయకులు

మచిలీపట్నం టౌన్, జులై 9 : ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి సోపానమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య అన్నారు. మంగళవారం టీడీపీ పార్లమెంటు కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ఇసుకను అప్పటి నాయకులు దోచుకుని 50 వేల కోట్ల రూపాయలు సంపాదిం చారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, మాజీ మునిసిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, హసీం బేగ్, దేవరపల్లి అనిత, లంకే హరికృష్ణ, బత్తిన దాసు, పివిఫణి కుమార్, తలారి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చారిత్రాత్మక నిర్ణయం..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం ఒక చారిత్రాత్మక నిర్ణయమని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశ పెట్టిన నేపథ్యంలో మంగళవారం మచిలీపట్నం ఆర్టీసీబస్టాండ్ సెంటర్‌లో సీఎం చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు టీడీపీ, జనసేన నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హసీంబేగ్, వాలిశెట్టి హైమావతి, పి.వి. ఫణికుమార్, పుప్పాల ప్రసాద్, జనసేన నాయకుడు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతికి బాట..

బంటుమిల్లి : ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట అని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీ జీవో నెంబరు 43 విడుదల చేయడం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని కాగిత తెలిపారు. గృహ నిర్మాణ శాఖకు ఇసుక సరఫరా పేరుతో 9 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేశారని, ఇసుక పాలసీ జీవో నెంబరు 43 సక్రమంగా అమలు జరిగేందుకు విజిలెన్స్ , కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, మైనింగ్ అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇంటి నిర్మాణ వ్యయం చాలా తగ్గుతుందని పేర్కొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి


ఆదర్శనగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్

మచిలీపట్నం టౌన్, జులై 9 : ఆదర్శనగర్ వంటి స్లమ్ ఏరియాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మచిలీపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు సూచించారు. మంగళవారం ఆదర్శనగర్‌లో పారిశుధ్య కార్యక్రమాలను కమిషనర్ బాపిరాజుతో పాటు టౌన్‌హాలు అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు చిన్నం శివనాగేశ్వరరావు పర్యవేక్షించారు. డ్రైన్లలో పూడిక తీయించే పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తాగునీటి పైపులైన్ల లీకులను సరి చేయాలన్నారు. ● ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని 45వ డివిజన్ సచివాలయ సిబ్బందికి కమిషనర్ బాపిరాజు సూచించారు. మంగళవారం 45వ డివిజన్ సచివాయాలన్ని కమిషనర్ ఆకస్మికంగా సందర్శించారు. అడ్మిన్ అల్లాభక్షుతో శానిటేషన్, లైటింగ్, తాగునీటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఏ. రామాంజనేయులు, వీఆర్వో కొండపల్లి రామానుజరావు పాల్గొన్నారు.

సమష్టికృషితో అభివృద్ధి చేద్దాం

ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా


పమిడిముక్కల మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, జులై 9 : పార్టీలు, రాజకీయాలకు అతీతంగా సమష్టిగా మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పిలుపునిచ్చారు. పమిడిముక్కల మండల సమావేశం మంగళవారం ఎంపీపీ కాసాని సుప్రజ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధవహించి స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగస్వాములమవుదామన్నారు. రెడ్డపాలెంలో తాగునీటి సమస్యపై సర్పంచ్ వీరమ్మ ఆందోళన వ్యక్తంచేశారు. మద్రివాడ సర్పంచ్ ఫ్రాన్సిస్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు గత ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రోటోకాల్ పాటించలేదన్నారు. దానిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల పట్ల ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.ఎం.సుభాని, వైస్ ఎంపీపీలు మహేశ్, సీతారామ్, జడ్పీటీసీ సభ్యురాలు వెంకట రమణకుమారి, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలి

పామర్రు : రోడ్ల నిర్మాణ పనుల్లో అవినీతికి ఆస్కారం లేకుండా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. తొమ్మిదో వార్డు పరిధిలో చేపట్టిన ఉరుటూరు- యాదవాపురం రహదారి నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ కార్యాక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, వల్లూరిపల్లి గణేష్, జనసేన ఎంపీటీసీ సభ్యుడు కూనపరెడ్డి సుబ్బారావు, తాడిశెట్టి నరేష్, నూకవరపు వీరాంజనేయులు, వీరంకి వెంకటేశ్వరరావు, కేదరాశిపల్లి శ్రీనివాసరావు, గంగాధర్ పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

అవనిగడ్డ, జులై 9 : అవనిగడ్డలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. గ్రామీణ యువజన వికాస సమితి, అంజనాస్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అవనిగడ్డ గాంధీక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 650 మంది అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనగా, 425 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, అంజనాష్ ఫౌండేషన్ వంటి సంస్థలు జన్మభూమిని మరువకుండా ఇక్కడి యువతకు ఉపాధి కల్పించేలా కంపెనీలు తీసుకొచ్చి జాబ్‌మేళా నిర్వహించటం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు బచ్చు నవీన్‌ను ఘనంగా సత్కరించారు. గ్రామీణ వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, అంజనాస్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు గీటురాయి ఎన్‌సీసీ విద్యార్థులు

మచిలీపట్నం టౌన్, జులై 9 : క్రమశిక్షనకు గీటురాయి అవుతుందని జిల్లా ఎంప్లాయిమెంట్ఎక్స్ఛేంజ్ ఆఫీసర్ విక్టర్‌బాబు అన్నారు. మంగళవారం హిందూ కళాశాలలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విభాగాలు సంయుక్తంగా అగ్నిపథ్ పథకంపై అవగాహన సదస్సునిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎస్. సందీప్, కళాశాల ప్రిన్సిపాల్ కుటుంబరావు, సుదర్శనం అయ్యంగార్‌లు మాట్లాడారు.

పెడనలో అక్రమ నిర్మాణాల గుర్తింపు

పెడన, జులై 9 : పెడన మునిసిపాలిటీలో అక్రమ నిర్మాణాల గుర్తింపు కార్యక్రమం కొనసాగుతోంది. అనుమ తులు తీసుకోకుండా చేపట్టిన నిర్మాణాలు, తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలు కలిపి మంగళవారం నాటికి మొత్తం 166 అక్రమ నిర్మాణాలను గుర్తించారు. కమిషనర్ బి. వెంకట్రామయ్య పర్యవేక్షణలో టీపీవో ఏసుబాబు ఆధ్వర్యంలో ప్లానింగ్ సెక్రటరీలు అక్రమ నిర్మాణాలను గుర్తిస్తున్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించండి

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నగరంలో స్వచ్ఛమైన తాగునీరందించాలని నగర పాలక సంస్థ ఎంఈ శ్రీకాంత్‌కు ఐద్వా ప్రతినిధులు కొడాలి సుజాత తదితరులు వినతిపత్రం సమర్పించారు. తాగునీటి సమస్యలపై ఐద్వా ప్రతినిధులు మునిసిపల్ కమిషనర్, డీఈలతో చర్చించారు. ప్రతి రోజూ తాగునీరందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సంఘ ప్రతినిధులు సిహెచ్. విజయలక్ష్మి, పరసా లక్ష్మి, బూర భవాని, సిహెచ్. అరుణకుమారి, పద్మావతి, చాందినీ తదితరులు పాల్గొన్నారు. ●మచిలీపట్నం అర్బన్ బ్యాంకులో సీసీ టీవీలను అపహరించారని కలెక్టర్‌కు బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు.

శ్రీకాకుళేశ్వరస్వామి ఆలయంలో

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మండలి బుద్ధప్రసాద్

ఘంటసాల, జులై 9 : శ్రీకాకుళంలోని శ్రీ కాకుళేశ్వర స్వామిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆయన కుమారుడు వెంకట్రామ్‌తో కలసి మంగళవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. దేవస్థానానికి విచ్చేసిన బుద్ధప్రసాద్‌కు ఆలయ ఈవో ఎన్.ఎస్. చక్రధరరావు స్వాగతం పలికారు. బుద్ధప్రసాద్‌ను దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్ , కూటమి నేత తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) ఆధ్వర్యంలో అపూర్వ స్వాగతం పలికారు. టీడీపీ నేతలు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, సర్పంచ్‌లు ముప్పనేని రవిప్రసాద్, గాజుల నాగ శ్రీనివాసరావు, గుత్తికొండ వరప్రసాద్, జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు.

●కూటమిది ప్రజా విజయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని శ్రీకాకుళంలో కూటమి విజయోత్సవం, టీడీపీ నేత తాడికొండ వెంకటేశ్వరరావు జన్మదినంను వైభవంగా నిర్వహించారు. యువ నాయకులు మండలి వెంకట్రామ్ (రాజా), టీడీపీ నాయకు లు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, సర్పంచ్ లు ముప్పనేని రవి ప్రసాద్, గాజుల నాగశ్రీనివాసరావు, దాసం రామకృష్ణ, కుంపటి చిట్టిబాబు, బండి పరాత్పరరావు, కాట్రగడ్డ శ్రీనివాస చక్రవర్తి, మునిపల్లి బుజ్జి, గుత్తికొండ వరప్రసాద్, భాను ప్రకాష్, పరిశె చలపతి, దిరిశం వెంకట్రావు, తాడికొండ సాయితేజ, టీడీపీ, జనసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జంపాన సత్కారం



మచిలీపట్నం టౌన్ : ప్రజా సమస్యలను త్వరితగతిన కలెక్టర్ బాలాజీ పరిష్కరిస్తున్నారని యునైటెడ్ ఫోరం ఫర్‌ఆర్‌టీఐ రాష్ట్ర కన్వీనర్ జంపాన శ్రీని వాస గౌడ్ అన్నారు. మంగళవారం కలెక్టర్‌ను కలసి అభినందించారు. వివిధ ప్రజా సమస్యలపై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ఓపికతో కలెక్టర్ వింటున్నారని, వృద్ధులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ కింది అధికారులకు చెప్పి పరిష్కరిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయి పర్యట నలు చేయడం వల్ల జిల్లా కలెక్టర్ వాస్తవాలను తెలుసుకుంటున్నారన్నారు.

వృద్ధాశ్రమానికి ఫ్యాన్లు అందచేత

మచిలీపట్నం టౌన్, జులై 9 : చిలకలపూడిలోని అన్నపూర్ణ వృద్ధాశ్రమంను మంగళవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ సందర్శించారు. వృద్ధులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమానికి ఐదు ఫ్యాన్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ నాగఛాయాదేవి, నాయకులు కొట్టె వెంకట్రావు, గడ్డం రాజు, సమీర్, చౌదరి, కర్రి మహేష్, బండి కరుణాకర్, సంకులనాని, శాయన శివ పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత


ప్రపంచ జనాభా దినోత్సవం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో

మచిలీపట్నం టౌన్, జులై 9 : అధిక జనాభా వల్ల దేశాభివృద్ధి కుంటుపడుతుందని, జనాభా నియంత్రణ ప్రతి పౌరుని బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య విస్తరణాధికారి బి శివసాంబిరెడ్డి, విద్యాబోధకుడు రాజేంద్రకుమార్, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● గ్రామీణ ప్రాంతాల్లో అతిసార వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ గీతాబాయి సూచించారు. బందరు మండలం చిన్నాపురం పీహెచ్‌సీ పరిధిలోని గొల్లపాలెం ఆరోగ్య మందిరం వద్ద గ్రామ ప్రజలకు జరిగిన అవగాహనా సదస్సులో గీతాబాయి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్య విస్తరాణాధికారి వి. శివసాంబిరెడ్డి, కె. మురళి, బి. రాజేంద్రకుమార్, పి.వి. పరమేశ్వరరావు, సిహెచ్. వసుంధర, ఎస్. రాంబాబు, మోహనరావు, ప్రసన్నాంబ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.